# ప్రజాపక్షం

# జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 17 ఏప్రిల్, 2026 | పేజీలు : 08


## ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలి

### వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీసీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా స్టేషన్లో ఉన్న ముఖ్యమైన కేసులకు సంబంధించి దర్యాప్తు ఎంతవరకు వచ్చింది అనే దానిపై ఆయన ఆరా తీశారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో డీసీపీ మాట్లాడి వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన పోలీసులను ఆదేశించారు. ఈ తనిఖీలలో ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహనకు

# మండల స్థాయి సమావేశాలు



### కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి గ్రామ, మండల స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ పథకాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, మహిళలకు అందిస్తున్న సేవలపై జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ వివరించారు. ఇతర శాఖల అధికారులు తమ తమ విభాగాలకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ దశల ప్రకారం ప్రతి వారం బిల్లులు సమయానికి చెల్లిస్తున్నామని చెప్పారు. ఎక్కడా బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి, ఇందిరానగర్, గుంటూరుపల్లి గ్రామాలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 100 శాతం ప్రగతి సాధించాయని అభినందించారు. మిగతా గ్రామాలు కూడా అదే విధంగా ముందుకు సాగాలని సూచించారు.బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న చిన్న సమస్యలను సర్పంచులు పరిష్కరించాలని, పంచాయతీల ద్వారా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో 100 శాతం విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అవసరమైతే ఖాళీ గదులు ఉన్న పాఠశాలలకు తరలించాలని అన్నారు.విలేజ్ న్యూట్రిషన్ డే సందర్భంగా గర్భిణీలు, చిన్నారులు, రక్తహీనత సమస్యలు, పోషకాహార లోపం వంటి అంశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా, ఏఎన్ఎం సిబ్బంది కృషితో జిల్లాలో టిబి కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఎల్కతుర్తిని టిబి రహిత మండలంగా కొనసాగిస్తూ, వచ్చే సంవత్సరం జిల్లాను టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించాలని అన్నారు.గంజాయి వ్యాప్తి గ్రామాల వరకూ చేరిందని ఆందోళన వ్యక్తం చేస్తూ, సమష్టిగా దాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరిగితే వెంటనే నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశం అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుకినే సంతాజీ, సర్పంచ్ లావణ్య, జడ్పీ సీఈవో శేషాద్రి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో లక్ష్మీ రమాకాంత్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, డీఈవో గిరిరాజ్ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, ఏడీఏ ఆదిరెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, తహసీల్దార్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు

# సమర్థంగా అమలు: కలెక్టర్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:**జిల్లాలో ప్రభు త్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగాఅమలవుతున్నాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట మండల సభను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సీఎం సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీలేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్నబియ్యం పంపిణి, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్దిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాన్ని ప్రతి గడపకి అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో టాప్ 2 లో నిలవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, గృహ నిర్మాణ పీడీ మాతృ నాయక్, మండల ప్రత్యేకాధికారి కోదండరాములు, ఎంపీవో వెంకటేశ్వర్లు, తహశిల్దార్ రాజేష్‌రెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణాలే అరైవ్ అలైవ్ కార్యక్రమం లక్ష్యం

**ప్రజాపక్షం/హనుమకొండ :** రోడ్డు ప్రమాదాల బారీన పడకుండా ఉండేందుకు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించేలా అవగాహన కల్పించడమే "అరైవ్ అలైవ్" కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సీఐడీ), ఉమెన్ సేఫ్టీ వింగ్, యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ జనరల్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ డైరెక్టర్ చారు సిన్హా తెలిపారు.గురువారం హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని కేవీఎన్ ఫంక్షన్ హాలులో వరంగల్ పోలీస్ కమిషనరేట్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీజీపీ చారు సిన్హా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమం ప్రారంభంలో రోడ్డు ప్రమాదాల కారణాలు, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై వీడియోలు, స్కిట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రుత్విక్ అనే బాలుడు తన తండ్రి హెల్మెట్ ధరించకపోవడంతో జరిగిన ప్రమాదంలో మరణించారని చెప్పి అందరిని ఆలోచింపజేశాడు.ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ చారు సిన్హా మాట్లాడుతూ, "అరైవ్ అలైవ్" కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తెలుసుకుని, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడమేనని పేర్కొన్నారు.




రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సురక్షిత ప్రయాణం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు.అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను బాధ్యతగా పాటిస్తే మనం మాత్రమే కాకుండా ఇతరులు కూడా సురక్షితంగా ఉంటారని పేర్కొన్నారు.విద్యార్థులను ఉద్దేశించి ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్న విషయాలను అడగగా, రుత్విక్‌తో పాటు పలువురు విద్యార్థులు, యువకులు స్పందిస్తూ ట్రాఫిక్ నియమాలు పాటించడం, ఓవర్‌టేకింగ్ చేయకపోవడం, ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం వంటి అంశాలను తెలుసుకున్నామని తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 13న "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రారంభించామని,

తరువాయి 3లో

## కేసీఆర్ కు లీగల్ నోటీస్‌ను ఖండించిన నాగజ్యోతి

**ప్రజాపక్షం/మంగపేట :**అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో కుంభకోణాన్ని బయటపెట్టిన నేపధ్యంలో మంత్రి సీతక్క మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి లీగల్ నోటీస్ లు పంపించడం తన మూర్ఖత్వానికి నిదర్శనం అని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి ఏద్దేవా చేశారు. ఫోన్ల కొనుగోలు విషయంలో అవినీతి జరగనప్పుడు భాజప్త విచారణ జరిపించాల్సింది పొయ్యి ప్రశ్నించిన వారికి నోటీసులు ఇవ్వడం ఏంటి అని ఆమె ప్రశ్నించారు. అయిన ఏనాడు నోటీస్ లు ఇవ్వలేదు భాజప్త తప్పు జరిగితే ఎంక్వైరీ చెయ్యమన్నారు. తప్ప అంగన్వాడిలకి 5G ఫోన్లు ఇస్తున్నాం అని ప్రచారం చేసి 4జి మొబైల్ ఫోన్లు ఇచ్చింది వాస్తవం కదా మంత్రి సీతక్క శాంసంగ్ గెలక్సీ A06 మోడల్ ఫోన్ మార్కెట్ రేట్ కి మద్యలో భారీ వ్యత్యాసం ఏంటి అని ఆమె ప్రశ్నించారు అధికారంలోకి వచ్చిన మొదటి నుండి ఈ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకి ఇచ్చిన హామీల మీద కాకుండా కేసీఆర్ ప్రతిష్ట ఎలాగైనా దెబ్బ తీయాలని చూస్తుంది అని అన్నారు. ఆకాశం మీద ఉమ్మితే తిరిగి ఆది తన మీదే పడుతుంది అని బడే నాగజ్యోతి అన్నారు.

## అంబేద్కర్ భావజాలానికి విరుద్ధమైన చర్యలను సహించేది లేదు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:**అంబద్కర్ భావజాలానికి విరుద్ధమైన చర్యలను సహించేది లేదని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండల శాఖ నాయకుడు మెరుగు లక్ష్మణ్ గురువారం ప్రకటనలో హెచ్చరించారు.గత మూడు సంవత్సరాలుగా అన్నారం క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని పట్టించుకోకుండా ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున విగ్రహా సుందరీకరణ అంటూ హడావిడి చేయడం రాజకీయమే అని తెలిపారు.అంబేద్కర్ భావజాలాన్ని,మహాత్ముల ఆశయాలను ప్రజలకు దూరం చేసేలా చేపట్టే చర్యలను సహించేది లేదని తెలిపారు. గత మూడేళ్లుగా పట్టించుకోకుండా విస్మరించి కేవలం ప్రెస్‌మీట్లకు,రాజకియ ప్రచారం కోసమో వాడుకోవడం సరికాదని తెలిపారు.సుందరీకరణ పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యవహరించడం అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధమని అంబేద్కర్ జయంతి వేడుకలను ఎటువంటి రాజకీయ రంగు పులమకుండా నిర్వహించాల్సిన బాద్యత అందరిపై ఉందని తెలిపారు.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలతో కలిసి సంతోషంగా జరుపుకున్నామని తెలిపారు.ఆయన ఆశయాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే సహించేది లేదని తెలిపారు.

## ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

**ప్రజాపక్షం/ములుగు:**రైతులు పండించిన ప్రతి వరి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి అన్నారు. మల్లంపల్లి మండలం కొడిశల కుంట క్రాంతి ఐకెపి సంఘం ఆధ్వర్యంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మహిళలకు సహకరించాలని కోరారు. ఈ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఓ కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ చంద్రశేఖర్, కొరిశల కుంట సర్పంచ్, ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఏపిఎం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సిసిలు విజయ, మల్లాచారి, వివో ఏ, ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులపై సమావేశం



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం త్రివేణి విశ్రాంతి భవనంలో గురువారం తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి గర్భాలయం, శుభానంద దేవి అమ్మవారి ఆలయాల పునరుద్ధరణ, పునప్రతిష్ట ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ , కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, ఈఓ మహేష్, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, సర్పంచ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన,మౌలిక వసతుల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. ఈనెల 20వ తేదీన ఆలయ పునప్రతిష్ట పనుల శంకుస్థాపనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక సందర్భంగా శిలాఫలకం, భూమి పూజ పనులకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇరవై ఒక్క కోట్ల నిధులతో చేపట్టిన మ్యూజియం, అక్షరాభ్యాసం మండపం, క్యూలైన్ల మండపంపై సాలారం నిర్మాణం తదితర పనులను పరిశీలించారు. తాజాగ స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఇటీవల కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన మోహన్ శర్మపై పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి గానీ,స్థానిక మంత్రి శ్రీధర్ బాబు గానీ ఈ విషయంపై ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

## హిందూ ధర్మాన్ని అబాసుపాలు చేసిన మంథని ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నియామకంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హిందూ ధర్మాన్ని అబాసుపాలు చేశారని కాటారం సబ్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మహదేవపూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు జక్కు రాకేష్, మహిళా విభాగం నియోజకవర్గ ఇంచార్జ్ కేదారి గీత, కాటారం బీఆరెస్ మండల అధ్యక్షుడు జోడు శ్రీనివాస్ లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి ఇటీవలనే మోహన్ శర్మ అనే వ్యక్తిని చైర్మన్‌గా నియమించారని, అయితే ఆయన బార్య మరణించగా మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని వారు తెలిపారు. కాళేశ్వర క్షేత్రంలో ఇంకా బ్రాహ్మణాధిపత్యం కొనసాగాలనే ఆలోచనతోనే మంథని ఎమ్మెల్యే తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో మాజీ ఎమ్మెల్యే, బహుజన నాయకుడు గొప్పగా ఆలోచన చేసి బీఆర్ఎస్ పార్టీ జెండా మోసిన నాయకుడికి చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తే అగ్ర వర్ణాలకు అవకాశం ఇచ్చారని ఆనాడు బదనాం చేశారని, కానీ ఈనాడు మంథని ఎమ్మెల్యే చేసిందేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే చైర్మన్ నియామకంలో జరిగిన తప్పును గుర్తించి మోహన్‌శర్మను బర్తరఫ్ చేసి మరొకరికి అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మండల యూత్ అధ్యక్షుడు అలీం, నాయకులు నరివేద్ది శ్రీనివాస్, గాలి సడవలి తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి గ్రామ సభ

### ఆరు గ్యారంటీల పై ప్రజలకు అవగాహన

**ప్రజాపక్షం/మహాదేవపూర్:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం అధికారులు మండల స్థాయి గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.స్థానిక సమస్యలపై పరిశ్కార మార్గాన్ని చర్చించి వివరించారు.అనంతరం రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్లు,ఇతర పథకాల లబ్ధిదారుల సంఖ్యను ప్రకటించారు.అలాగే నేతన్న భరోసా పథకంలో మండలంలో 148 మంది చేనేత కార్మికుల లబ్ధిదారులకు నెలకు 2 వేల చొప్పున మూడు నెలలకు గాను 372000 ఆర్థిక సహాయం మొత్తంగా 20లక్షల 70 వేల రూపాయల చెక్కును చేనేత కార్మికుల సంఘానికి అందించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్,ఎంపిడిఓ రవీంద్రనాథ్,తహసీల్దార్ సత్యనారాయణ స్వామి,జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు,సర్పంచ్ హసీనా బానో అక్బర్‌ఖాన్,మాజీ ఎ ంపిపి రాణీబాయి రామారావు,వివిధ గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు,కార్యదర్శులు,సమైఖ్య సంఘాలు ,వివిధ పథకాల లబ్దిదారులు అధికారులు, పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు



**ప్రజాపక్షం/మంగపేట :**మండలంలో రైతు వేదికలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల సర్వ సభ్యసమావేశం గురువారం ఏంపిడిఓ బద్రు నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ములుగు జిల్లా పంచాయతీ అధికారి కొండా వెంకయ్య పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య హాజరై పలు శాఖల అధికారులతో మండలంలో జరిగిన జరుగబోవు అభివృద్ధి పనుల మీద సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల్లోకి వెళ్లే విదంగా ప్రతి శాఖ నుండి వివరాలు అడిగి తెలుకున్నారు. మండలంలో మంచి నీటి ఏద్దడి రాకుండా చూడాలి ప్రతి ఒక్క కుటుంబానికి గృహ జ్యోతి అమలు అవ్వాలి పింఛన్ లు, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, కల్యాణ లక్ష్మి, విద్య, వైద్యం, విషయంలో పేద ప్రజలకు ఆరోగ్య విషయంలో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందించాలని, ప్రభుత్వం అందించే ప్రతి పథకం ప్రతి కుటుంబానికి అందె విదంగా ప్రతి ఒక్కరు అన్ని శాఖలు కలసి పని చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ తోట రవీందర్, ఎస్ఐ టీవీ ఆర్ సూరి, ఎఫ్ఆర్ఓ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ ఈఓ చేరాలు ఏంపిఓ మహేందర్, రాజకీయ నాయకులు చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు, అయ్యోరి యాణయ్య, ఎర్రంగారి సురేష్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## టీబీ నివారణకు ప్రత్యేక కృషి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** టీబీ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని జిల్లా వైద్యాధికారి మల్లిఖార్జున రావు అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ పేస్ 2లో భాగంగా బచ్చన్నపేట సీహెచ్‌సీని ఆయన సందర్శించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ టీబీ నివారణకు సక్రమంగా మందులు వాడితే తొందర్లోనే నయమవుతుందన్నారు. ఎండలు బాగా కొడుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్ కుమార్, కమలహాసన్, డా. శ్రీనివాస్, సృజన, సుదర్శన్‌రెడ్డి, ప్రసన్న కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై కళాకారుల ప్రదర్శన

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో పాటల రూపంలో ప్రజలను చైతన్యవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం ఆధ్వర్యంలో తమ ఆటపాటల, ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐ అబ్బయ్య, గ్రామ సర్పంచ్ నర్సింగరావు, నాయకులు మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుతిరుగుతున్న నిందితుడి అరెస్ట్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గత కొన్నేళ్లుగా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుతిరుగుతున్న ఓ నిందితుడిని బచ్చన్నపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నర్మెట సీఐ అబ్బయ్య కథనం ప్రకారం మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన శివరాత్రి నర్సింహులు (50)పై అతని భార్య సుశీల 2011లో ఫిర్యాదు చేసిందన్నారు. నర్సింహులుపై అప్పట్లో సెక్షన్ 498 ఎ, ఐపీసీ, వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్ 3, 4 కింద కేసు నమోదైందని, అప్పటి ఎస్ఐ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారని నిందితుడు 2019 నుంచి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుంటున్నాడన్నారు. కోర్టు ఆదేవాల మేరకు గాలిస్తున్న పోలీసులు నర్సింహులును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి అతనికి జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితుడిని జైలుకు తరలించినట్లు నర్మెట సీఐ అబ్బయ్య తెలిపారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి డెకరేషన్, టెంట్ హౌస్ అధినేత రేపాల అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. తీవ్రమైన ఎండాకాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటుచేయడం అనేది చాలా మంచి ఆలోచన అన్నారు. అనంతరం రేపాల అశోక్‌ని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించాలి-దయాకర్‌రావు



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డ్‌ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోతుందని సకాలంలో రైతులబంధు ఇవ్వకపోగా కనీసం పండిన పంటను మద్దతు ధరకు కూడా కొనే పరిస్థితిలో కూడా లేదన్నారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలుచేయలేదని అన్నారు. మక్కలు, కందులు, శనగలు, జొన్నలకు బోనస్ ఇవ్వడం లేదని గత యాసంగి బోనస్ వెంటనే విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులున్నారు.

## పసర సెక్షన్ పరిశీలించిన నూతన ఎస్ఈ బిక్షపతి

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలోని పసర సెక్షన్ ను గురువారం జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్ ఈ బిక్షపతి సందర్శించి పరిశీలించారు సెక్షన్ లో జరుగుతున్న పనితీరు విద్యుత్ సరాఫరా తదితర అంశాలను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు కార్యాలయంలోని పలు రికార్డులను చూసి పరిశీలించారు సెక్షన్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు 2011వ సంవత్సరం నుండి 2014 వరకు ములుగు జిల్లాకు డిఈగా సేవలందించారు అనంతరం ఎస్ ఈ బిక్షపతిని ములుగు డివిజన్ డిఈ నాగేశ్వరరావు ఏడిఈ రాజేష్ సబ్ ఇంజనీర్ అఖిల ఓ యం స్టాఫ్ లైన్స్పెక్టర్ రామ చంద్రయ్య లైన్మన్ తిరుపతి ఏ ఎల్ ఎమ్ బిక్షపతి లు స్వాగతం పలకగా సెక్షన్ కాంట్రాక్టర్ జబ్బర్ పాషా శాలువతో సన్మానించడం జరిగింది.

## కిడ్నాప్ కేసులో వ్యక్తుల రిమాండ్

**ప్రజాపక్షం/ములుగు:** కిడ్నాప్ కేసులో వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం గ్రామానికి చెందిన రుద్రరపు శివ, వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన నిందితుని చెల్లి ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఇది తెలిసిన అమ్మాయి అన్న గుగులోత్ రాజేష్ అతని స్నేహితులు కొర్ర సునీల్ అరవింద్, హరికృష్ణ, హరిదాసులు బుధవారం ఉదయం 5గంటల ప్రాంతంలో రామచంద్రపూర్ లోని రుద్రరపు శివ తండ్రి ఐలయ్యను కొట్టి వారు ఐదుగురు బలవంతంగా ఐలయ్యను ఆటోలో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి విపరీతంగా కొట్టడం జరిగిందని, ఇట్టి విషయంపై బాధితుని భార్య రుద్రారపు సునీత ఫిర్యాదు ఇవ్వగా ఇట్టి ఫిర్యాదు వారిక కేస్ నమోదు చేసి సిబ్బంది సహాయంతో టీములుగా ఏర్పడి అందుబాటులో ఉన్న సిసి టివిలు పరిశీలించి అట్టి నిందితులు ఆటోలో పారిపోతుండగా వెంబడించి మల్లంపల్లి వద్ద వారిని పట్టుకొని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా క్లెయిమ్ అందజేత

**ప్రజాపక్షం/ములుగుః** వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన జనుగాం కుమారస్వామి దురదృష్టవశాత్తు మరణించగా, వారికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నందు డిఓ బండి నర్సయ్య, ముప్పై వేల వార్షిక ప్రీమియంతో పాలసీ చేయించారు. రెండు సంవత్సరాల పాలసీ చెల్లించిన అనంతరం వారి పాలసీకి సంబంధించిన బీమా మొత్తం రూ.5లక్షల 40వేల క్లెయిమ్ వారి నామిని అయిని జనగాం శోభకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదండ్ల రాజు, ప్రశాంత్ రాజ్‌కుమార్, మధు, రంజిత్, నవీన్,, పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ సహకారంతో గూడూరు మండల కేంద్రంలో సీఎం రిలిఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణి కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ఆధ్వర్యంలో గూడూరు మాజీ ఎంపిపి మాజీ సర్పంచ్ నూనవత్ రమేష్ నాయక్ చెక్కుల పంపిణి చేశారు. గురువారం బైరబోయిన అనిల్‌కు 26000 రూ కాయతప్ భద్రమ్మకు 20000 రూ కలకత్తా తండాకు చెందిన వాంకుడోత్ దేవేందర్‌కు 12000 రూ దంతారాబోయిన చంద్రమ్మ కు రూ 26000 రూ చెక్కులను నాయకలు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో కట్ల భవాని విష్ణు బాలునాయక్ పాల్గోన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలి




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని సింగరేణి కమ్యూనిటీ హాల్లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మండల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బుర్ర కొమరయ్య హాజరై మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ముఖ్యమని సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలు తీర్చే విదింగా పనులు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ. 500 గ్యాస్ సబ్సిడి, ఇందిరమ్మ ఇండ్లు లాంటివి ప్రభుత్వ పథకాలను చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు అందే విధంగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు భాగస్వాములు కావాలని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ సిపిఒ జవరల్‌లాల్ మాట్లాడుతూ, పల్లెలు పట్టణాలకు పట్టుకోమ్మలని, పల్లెలు అభివృద్ధి చెందితేనే జిల్లాలు అభివృద్ధి చెందుతాయని అందరూ సమన్వయంతో గ్రామాల అభివృద్ధి తోడ్పడాలని కోరారు.ప్రభుత్వం నూతనంగా ఇందిర భీమా, విద్యార్థులకు బ్రేక్‌పాస్టు, వికాలాంగుల సైకిల్లు లాంటి నూతనపథకాలు అందిస్తుందని వాటిని అందరి అందేవిదంగా చూడాలని తెలిపారు. యువత డ్రగ్స్ వైపు పోకుండా చూడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మి రాజం, ఎంపిడిఒ నాగరాజు, ఎస్సై గీతా రాథోడ్, ఎఒ సతీష్, సూపరిండెంట్ రవీందర్, ఎపిఎం పద్మ, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## పల్లెల ప్రగతికి ప్రణాళికలు రూపొందించుకోవాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** పల్లెల ప్రగతికి ప్రణాళికలు రూపొందించుకోవాలని తొర్రూరు ఆర్డీఓ గణేష్ అన్నారు. మండలంలోని వెలికట్ట శివారు శ్రీనివాసగార్డెన్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొని సమావేశంలో వ్యవసాయం, ఆరోగ్యం, సంక్షేమం, విద్యా, రోడ్డు భద్రత, స్త్రీ, శిశు సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీఓ కూస వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ నిర్వహణలో చేపట్టిన ఈ సమావేశంలో ఆర్డీఓ గణేష్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించడంతో పాటు భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యచరణను చేపట్టిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకు వెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు లేని గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి విజయ్‌చందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, మిషన్ భగీరథ ఈఈ సురేందర్, ఎస్ఐ అంజమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక సమావేశం విజయవంతం



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యచరణ విజయవంతం కొరకు గోవిందరావుపేట మండలంలోని రైతు వెదికలో మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి బి జయరాజ్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచుల మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు మండల సమాఖ్య సభ్యులు అలాగే వివిధ శాఖల ద్వారా లబ్ది పొందిన లబ్దిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు లబ్దిదారులు తమ అభిప్రాయాలను సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పథకాలపై స్పందించారు సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ తమ విభాగాల ద్వారా సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో వివరించారు ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు పై సమగ్ర సమీక్ష నిర్వహించాఉ అదే విధంగా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్ కె తాజుద్దీన్ రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ వాహనదారులు ప్రజలు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు అవకాశం ఇవ్వకూడదని హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం మమత తహసీల్దార్ ఎన్ సృజన్ కుమార్ వ్యవసాయ అధికారి కె జితేందర్ రెడ్డి విద్యాశాఖ అధికారి గొంది దివాకర తదితర శాఖల అధికారలు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడు నరేందర్‌రెడ్డిని కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/తొర్రూరు:** నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామసహాయం క్రిష్ణకిశోర్‌రెడ్డి, తొర్రూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు మర్యాదపూర్వకంగా ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ సభ్యులుగా నియామకమై గురువారం ప్రమాణస్వీకారం చేయడం మహబూబాబాద్ జిల్లాకు రాజ్యసభలో చోటు దక్కినందుకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని రామసహాయం క్రిష్ణకిశోర్‌రెడ్డి, కాకిరాల హరిప్రసాద్‌రావులు తెలిపారు. అదే విధంగా పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాలని, కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసి గెలిపించిన వారిని కాదని వేరే వ్యక్తులకు ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా తొర్రూరు నియోజకవర్గం ఏర్పడితే జనరల్ మహిళా స్థానంలో స్థానికులకు టిక్కెట్ కెటాయించాలని, అమెరికా పౌరసత్వం ఉన్న వారి నుండి పాలకుర్తి ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## సురక్షిత ప్రయాణాలే అరైవ్ అలైవ్ కార్యక్రమం లక్ష్యం

మెదటి పేజీ తరువాయి

18వ తేదీ వరకు ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రైవేట్ బస్సు డ్రైవర్లకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వారం రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, డ్రైవర్లకు కళ్లద్దాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు.వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో తమ కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. పాఠశాలలు, మండల విద్యాధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేస్తున్నామని చెప్పారు.మెడికల్ క్యాంపులు, హ్యూమన్ చైన్‌లు, పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాటు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు ధార కవిత, అంకిత్ కుమార్, వరంగల్ ఏఎస్పి శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎంవిఐలు వేణుగోపాల్, శోభన్ బాబు, కిషోర్ బాబు, ఇతర అధికారులు, వివిధ సంస్థల వాహనాల డ్రైవర్లు, ప్రజలు సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## సహస్ర ఆటో యూనియన్ అధ్యక్షులుగా భూక్య హంజీ

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పసర నుంచి మేడారం వరకు నడిచే సహస్ర ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులుగా భూక్య హంజీ భాధ్యతలు స్వీకరించారు ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షులు అయిలి అశోక్ రోశాధికారి భూక్య రతన్ సింగ్ ప్రధాన కార్యదర్శి కాళిదాసు పాల్గొన్నారు సభ్యులు రామ్మూర్తి సర్వర్ చల్ల శ్రీను తదితరులు హాజరయ్యారు ఈ సందర్భంగా ఎస్ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు యూనిఫామ్ ధరించడం అనివార్యమని ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని తెలిపారు యూనియన్ సభ్యులు కూడా భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలోని చల్వాయి గ్రామంలో గురువారం రామాంజలి వివో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చల్వాయి సర్పంచ్ మేకల రాధా సుదర్శన్ ప్రారంభించారు రవి ధాన్యం కొనుడొలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ సూచించారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ నిబంధనకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలోమధుసూదన్ రెడ్డి , సీతారామయ్య, కృష్ణమూర్తి , నాగలక్ష్మి రామాంజలి, విజయలక్ష్మి ,ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

## సెన్సస్ 2027 విధులు కేటాయింపులో లోపాలు సవరించాలి

**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండలంలో సెన్సస్ 2026 2027 జనగణన విధులు కేటాయింపులో జరిగిన లోపాలను తక్షనమే సవరించాలని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. విధులు అలాట్‌మెంట్‌లో పారదర్శకత లేకపోవడం వల్ల అర్హులైన సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీనియార్టీ ఆధారంగా విధులు కేటాయించాల్సి ఉండగా అనేక చోట్ల జూనియర్ సిబ్బందికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా సూపర్వైజర్ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్లను నియమించాల్సిన పరిస్థితిలో ఎస్జిటిలకు బాధ్యతలు అప్పగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎటిఎ ఎటిఎఫ్ యుటిఎఫ్ టిడబ్ల్యూటియు ఎస్సి ఎస్టి యూనియన్‌లకు చెందిన నాయకలు మయ్యబోయిన వెంకన్న వెంకన్న శ్రీను ,రమేష్ ,స్వామినాథన్ , కృష్ణ తేజవత్ పాల్గోన్నారు.

## మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం



ప్రజాపక్షం/నెక్కొండ:ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నెక్కొండ మండల స్థాయిలో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, తహసీల్దారు వేముల రాజ్‌కుమార్, ఎంపిడిఓ జి దయాకర్, సబ్ ఇన్స్‌పెక్టర్ మహేందర్‌లు పాల్గొన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత, సిడిపిఓ పెండ్యాల హరిప్రసాద్‌తో పాటు ఇతర శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రజా సేవల అమలు, సంక్షేమ పథకాల చేరవేత, మౌళిక వసతుల మెరుగుదలపై అధికారులు చర్చించారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

ప్రజాపక్షం/రాయపర్తి:మండలంలోని బురహాన్‌పల్లి గ్రామానికి చెందిన బాల లక్ష్మయ ఆత్మహత్య చేసుకొని మరణించగా, తీర్మలాయపల్లి గ్రామానికి చెందిన బరిగేల ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి చిత్రపటాలకు గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి వరంగల్ లో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం / వరంగల్ : దళిత కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలు, శుక్రవారం నుండి రెండు రోజుల పాటు వరంగల్ నగరంలోని అబ్బు ఫంక్షన్ హాల్ లో జరుగుతున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్ తెలియజేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి వి ఎస్ నిర్మల్, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస రావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం తదితరులు హాజరువుతున్నట్లు ఆయన తెలిపారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ మహాసభలలో రాష్ట్రంలోని దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# దక్షిణ రాష్ట్రాల పట్ల కేంద్రం చిన్న చూపు

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: రాష్ట్రాల సమాఖ్య దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి దక్షిణ రాష్ట్రాలు ప్రతి కేంద్ర ప్రభుత్వంలో చిన్న చూపే ఎదురవుతున్నదనీ అనేక ఉదాహరణలు ఉటంకించ వచ్చునని సామాజికవేత్త కాకతీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ఆరోగ్య రంగాలను బలోపేతం చేసి ప్రజలను చైతన్యపరిచి దక్షిణ రాష్ట్రాలు జనాభా నియంత్రించి అభివృద్ధి సాధించి కేంద్రానికి జీఎస్టీ ఎక్సైజ్ పన్నుల రూపంగా అత్యధిక నిధులు చెల్లిస్తున్నప్పటికీ దక్షిణ రాష్ట్రాలకు కనీస దామాషాలో నిధులు కేటాయించడం లేదని ఇప్పటికే దక్షిణ రాష్ట్రాల ప్రభుత్వాలు గగ్గోలు పెట్టినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సర్వసాధారణమైందనీ ఈరోజు పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రొఫెసర్ కూరపాటి అన్నారు. కేంద్రం విధానం సమాఖ్య స్ఫూర్తికి జాతీయ సమైక్యతకు విరుద్ధమని అన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో ఇప్పటికీ జనాభా పెరుగుతూనే ఉందని, 2011 జనాభా ప్రాతిపదికన నిర్ణయించే పార్లమెంటు సీట్లు హిందీ రాష్ట్రాలకు 77 శాతం పెరుగుతుండగా దక్షిణాది రాష్ట్రాలకు కేవలం 33 శాతం మాత్రమే పెరుగుతున్నాయనీ ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు ద్వారా లోకసభలో దక్షిణాది ప్రాతినిధ్యం ప్రస్తుతం ఉన్న 23 శాతం నుండి 20 శాతానికి తగ్గుతున్నదనీ అదేవిధంగా బెంగాల్ ఒరిస్సా తూర్పు ఆస్సాలకు కూడా ప్రాతినిధ్యం తగ్గిపోతున్నది.పార్టీల మధ్యన ఉన్న వైశ్యామ్యాల కారణంగా ప్రజాస్వామ్యానికి సమాఖ్య స్ఫూర్తి కి విగాథం జరగకూడదని అంతిమంగా దేశ ప్రజలందరికీ న్యాయం జరగాలని అన్నారు.

# ఢిలీ వరకు వేం నరేందర్ రెడ్డి విజయయాత్ర

ప్రజాపక్షం/నెక్కొండ:రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్‌రెడ్డికి నర్సంపేట నియోజకవర్గం నుండి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. ప్రజాసేవలో తనకుంటు ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నరేందర్ రెడ్డి ఎదుగుదలపై స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నేడు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి, వేం నరేందర్ రెడ్డిని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేందర్ రెడ్డి అనుభవం, ప్రజల పట్ల నిబద్ధత దేశస్థాయిలో కూడా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ స్థాయిలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. వివిధ వర్గాల ప్రజలు, యువత, రైతులు, మహిళలు ఆయనకు శుభాభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలను దేశ పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తారని ఆశాభావం



వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా సినీనటుడు బాలకృష్ణ అభిమానులు, ఎన్‌టిఆర్ అభిమానులు కూడా తమదైన శైలిలో నరేందర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రాజ్యసభలో నరేందర్ రెడ్డి ప్రవేశంతో తెలంగాణ సమస్యలు మరింత బలంగా వినిపిస్తాయని స్థానికులు భావిస్తున్నారు. నర్సంపేట నియోజకవర్గానికి, ముఖ్యంగా నెక్కొండ మండలానికి మరిన్ని అభివృద్ధి అవకాశాలు తీసుకురావాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడమే లక్ష్యం

ప్రజాపక్షం/ నర్సంపేట : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడమే లక్ష్యమని నర్సంపేట ఆర్డీవో ఉమారాణి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలోని రైతు వేదికలో సమీక్ష సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో ఉమారాణి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రజల్లోకి అందించే ప్రక్రియలో భాగంగా అన్ని శాఖల తో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మీ, తహసీల్దార్ రవిచంద్ర, ఎంఈవో కొర్రసారయ్య, పోలీస్ అధికారులు, అన్ని శాఖల అధికారులు హాజరై మాట్లాడారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫుడ్



స్టాల్ ను ఆర్డీవో, అధికారులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో పాటు సర్పంచులు, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ పారిజాతం, అరుణ, నర్సంపేట మండల అంగన్వాడీ టీచర్స్, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్తపై స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశానుసారం 32వ డివిజన్‌లోని ఉర్సు గుట్ట వద్ద గల డిఆర్‌సిసి సెంటర్‌లో 32, 33, 40 డివిజన్‌లోని స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు తడి, పొడి చెత్త వేరు పరుచుట కొరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా స్థానిక 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి, నగరపాలక సంస్థ సిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్‌లు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ సిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ప్రతి ఇంటి నుండి చెత్తను తడి పొడిగా వేరు చేసి తీసుకోవాలని, తీసుకున్న తడి చెత్తను పోతననగర్ డంపింగ్ యార్డుకు తరలించాలని, పొడి చెత్తను డిఆర్‌సిసి సెంటర్కు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో డ్రైవర్ వారికి అప్పగించిన 600 గృహాల సముదాయాలలోని ప్రతి ఇంటి నుండి ప్రతి రోజు చెత్తను తీసుకొని విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో



డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా చెత్త తరలించు వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నడిపే క్రమంలో పాటించాల్సిన జాగ్రత్తలు, నడిపే క్రమంలో పాటించాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్‌వైజర్స్ నరేందర్, శ్రీను, స్థానిక 32వ డివిజన్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజు, ఐటిసి నుండి పవన్, డిఆర్‌సిసి సెంటర్ ఆపరేటర్ మాదాసి సుమలత బిక్షపతి, జవాన్స్ ఓరుగంటి జీవన్, సారంగపాణి, కిరణ్, కృష్ణ, ఆదాము, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయ్యాలి

ప్రజాపక్షం / నల్లబెల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయ్యాలని ప్రజాపాలన ప్రత్యేకాధికారి డి.ఇజ్జగిరి అన్నారు . గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇంచార్జీ ఎంపిడి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో పాల్గొని మాట్లాడారు . ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రత్యేకాధికారి ఇజ్జగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేల చూడాలని కోరారు . ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ,రైతు భరోసా ,మహాలక్ష్మి ,గృహజ్యోతి ,చేయూత పెన్షన్స్ ,కొత్త రేషన్ కార్డుల మంజూరి ,మహిళలకు వడ్డిలేని రుణాలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు . ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీపతి , తహసీల్దార్ ఎం.కృష్ణ ,ఎంపిఓ రవి ,ఐకెపి ఎపిఎం ,మండలంలోని సర్పంచులు తదితరులు పాల్గొన్నారు .

## రిజిస్ట్రేషన్ కార్యాలయంపై విజిలెన్స్ దాడులు

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డాక్యుమెంట్లు స్టాంపులు భూముల క్రమ విక్రయాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం స్టాంప్ డ్యూటీ ఫీజులు కట్టడం లేదని సమాచారం మేరకు విజిలెన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలతో వరంగల్ రేంజ్ విజిలెన్స్, డిఎస్పీ డైరెక్టర్ ఆదేశాలతో వరంగల్ రేంజ్ విజిలెన్స్ డిఎస్పి మల్లయ్య, తహసీల్దారు లక్ష్మణ్, విజిలెన్స్, ఇన్స్‌పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారుల నుండి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకొని ప్రభుత్వానికి చెల్లించే పన్నులు చెల్లింపులను పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వెంకట్‌లాల్‌ను అధికారులు విచారిస్తున్నారు. దాడుల సమాచారం ముందుగానే తెలిసిన డాక్యుమెంట్ రైటర్లు తమ షెటర్లు మూసివేసి అక్కడి నుండి పరారయ్యారు. ప్రస్తుతం అధికారుల తనిఖీలు కొనసాగుతుండగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/రాయపర్తి:అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర అగ్నిమాపక అధికారి సిహెచ్ జయపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాడకంలో జాగ్రత్తలు వహించాలని, నిర్లక్ష్యం చేస్తే గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, అజ్మీర్ పాషా, గోపాల్, శ్రీకాంత్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

ప్రజాపక్షం/రాయపర్తి:అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి కల్పన అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు వడ్డీ లేని రుణాలను అందిస్తుందని అన్నారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కిష్టారెడ్డి, ఎంపిడిఓ కిషన్, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపిఓ ప్రకాష్, ఏఈలు అనూష, సర్పంచ్‌లు గారె సహేంద్ర బిక్షపతి, సుధాకర్, మహేందర్ రెడ్డి, వేణు, యాకయ్య, రఘు, గోపాల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

## ఘనంగా నాగులపల్లి సర్పంచ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామ సర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్ జన్మదిన వేడుకలను గురువారం నాగులపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ సుమతి శివకుమార్ చేత కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్ మాట్లాడుతూ, తన జన్మదినం సందర్భంగా గ్రామంలోని 50 సంవత్సరాలు నుంచి 64 సంవత్సరాల లోపు రైతులకు తన సొంత డబ్బులతో గ్రోమోర్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించడం జరిగిందన్నారు. ఈ పాలసీ చేయించుకున్న రైతులు ప్రమాదవశత్తు మరణిస్తే 2 లక్షల బీమా వస్తుందని ఆమె తెలిపారు. సొంత డబ్బులతో గ్రామంలోని రైతులకు ఇన్సూరెన్స్ చేయించినందుకు గ్రామస్తులు గ్రామ సర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఇంద్రసేనారెడ్డి, రామ్ రెడ్డి, జాన్ తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయ్యాలి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గ్రామ గ్రామానా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ అన్నారు. నిజాంపేటలోని రైతు వేదికలో ఎంపీడీఓ రాజీరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రజాల్లో ప్రభుత్వ సంక్షేమ సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, రైతుబంధు, పథకాలపై అవగాహన కల్పిమచాలన్నారు. ఆరైవ్అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ రాజేష్ హెల్మెట్, రోడ్డు భద్రత నియమాలను వివరించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షత గాత్రులను హాస్పిటల్లో చేర్పిస్తే 25 వేల రూపాయల పారితోషికం జిల్లా కలెక్టర్, ఎస్పీల చేతుల మీదుగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికీ సమన్వయంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/పాపన్నపేట:**గ్రామాల అభివృద్ధికీ అధికారులు,నూతన సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని డిఎల్ పివో సురేష్ బాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్, నీటి సమస్యలు పరిష్కరించాలని సర్పంచులు అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల అజెండాను చదివి వినిపించారు. గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులు గ్రామ ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు నీరుడి వెంకటేశం, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల సమావేశాలు





**ప్రజాపక్షం/కొల్చారం :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తాగు నీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మహిళా సంఘాల బలోపేతం, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, స్వయం సహాయక గ్రూపులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, డిఈఓ విజయ, తాసిల్దార్ శ్రీనివాస చారి, ఎంపీడీఓ రఫీక్ ఉన్నిసా బేగం, సర్పంచ్ శేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ ఎమ్మెల్యే చొరవతో మంజీరా నీటి విడుదల



**ప్రజాపక్షం/కొల్చారం :** నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చొరవతో సింగూర్ ప్రాజెక్టు నుంచి మంజీరా నీటి విడుదల జరగడంతో ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పైతర గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు యబన్నగారి రవి తేజ రెడ్డి గురువారం పైతర చెక్ డ్యామ్ వద్ద గ్రామ రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 20వ తేదీన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఘనపూర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించారని తెలిపారు. మార్చి 23న సింగూర్ నుంచి నీటి విడుదలకు ఆదేశాలు వచ్చినప్పటికీ, మంజీరా బ్యారేజీ వద్ద నీటిని నిలిపివేయడంతో పంటలకు కొంత నష్టం వాటిల్లిందన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పైతర గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగంపల్లి మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ సుధాకర్, మురళి గౌడ్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, సొసైటీ డైరెక్టర్ జీవయ్య, వార్డు సభ్యులు, రైతులు ఉన్నారు.

# మడిపల్లిలో మౌలిక వసతులకు శ్రీకారం



**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండలం మడిపల్లి గ్రామంలో మరో అభివృద్ధి ఘట్టానికి నాంది పలికింది. సౌత్ సెంట్రల్ రైల్వే సహకారంతో రూ.40లక్షల వ్యయంతో 500 మీటర్ల సైడ్ డ్రైనేజ్ నిర్మాణం, 16 అడుగుల వెడల్పు, 10 ఇంచుల మందంతో సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ ఆంగోత్ అనూష వినోద్ లోక్ నాయక్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి దిశగా చేపట్టిన ఈ పనులు పూర్తయితే మడిపల్లిలో రహదారి సౌకర్యాలు మెరుగుపడడంతో పాటు వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యకు పరిష్కారం లభించనుంది. గ్రామాన్ని భవిష్యత్తులో పట్టణ స్థాయికి తీసుకెళ్లే దిశగా మౌళిక వసతులను విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రైల్వే అధికారులతో నిరంతర సమన్వయం కల్పించిన నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామాభివృద్ధికి ప్రజల మద్దతు కీలకమని నాయకులు పేర్కొన్నారు.

# పర్మినెంట్ గా తొలగిస్తామని బెదిరించడం అమానుషమే



**ప్రజాపక్షం/ వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్స్ సాధనకై తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపచేయించే బదులు విధులలో చేరకుంటే పర్మినెంట్ గా తొలగిస్తామని బెదిరించడం అమానుషంగా ఉందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు. విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయ సమ్మతమైన సమ్మెకు ఆయన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈసందర్భగం ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు గొంతెమ్మ కోరిక లేమి కోరడం లేదని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను అమలు జరపాలని వారు కోరడం నేరమా అని ప్రశ్నించారు. అనేక సంవత్సరాలుగా 20 వేల మంది ఆర్టిజన్లు తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని పాలకులతో మొరపెట్టుకున్న ఫలితం లేనందున విధి లేక తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జెఏసి నాయకత్వాన సమ్మె చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలకు వెలుగులను అందించేందుకు ఎండకు చలికి భరిస్తూ రాత్రింబవళ్లు శ్రమ చేస్తూ ప్రమాదకర పరిస్థితుల్లో సైతం ప్రాణాలకు తెగించి ఎత్తైన స్తంభాలెక్కి విధులను నిర్వహిస్తున్న వీరి జీవితాల్లో వెలుగులు లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారు, అంగవైకల్యం చెందినవారు ఎందరో ఉన్నారని వారి కుటుంబాలు పడుతున్న బాధలు వర్ణణాతీతమన్నారు. ప్రభుత్వం సమ్మె చేస్తున్న కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడం మానుకొని జెఏసి ప్రతినిధులతో ప్రజాస్వామ్యయుతంగా చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యల్ని పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు అందించాలి

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా గురువారం స్థానిక వెంకటేశ్వర దేవాలయంలో మండల స్థాయి సమావేశం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, ఇంచార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పథకాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ రేణుక రెడ్డి,ఎస్ఐ శంకర్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు నరసింహారెడ్డి, సర్పంచులు మద్దూరి సౌమ్య సురేష్ గౌడ్, వీరన్న, శశిధర్ రెడ్డి, రమ్య భూమ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శంకర్, హరికృష్ణ, రేణుక, కవిత, పడిగే జ్యోతి, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, మచ్చేందర్, మండల స్థాయి ఆయా శాఖల అధికారులు ఉప సర్పంచులు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు అర్ధరహితం

### భేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



**ప్రజాపక్షం / గజ్వేల్:**పునర్విభజన బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోలుస్తూ అవమానకర వ్యాఖ్యలు చేయడం అర్ధరహితమని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఖండించారు. రాష్ట్ర ఏర్పాటుపై పదే పదే బీజేపీ తన అక్కసు వెళ్ళగక్కే ప్రయత్నం చేస్తుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దశాబ్దాల పోరాటం, త్యాగాల ఫలితంగా, రాజ్యాంగ బద్ధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని అన్నారు. తెలంగాణ పోరాటం పట్ల గానీ, చరిత్ర పట్ల గానీ బీజేపీ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని పార్లమెంట్ వేదికగా గతంలో కూడా అనేక సందర్భాల్లో బీజేపీ నేతలు తెలంగాణ ఏర్పాటు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానపరిచారని గుర్తు చేశారు. గతంలో సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ఏర్పాటుపై మాట్లాడుతూ తల్లిని చంపి బిడ్డను బ్రతికించారని అనుచిత వ్యాఖ్యలు చేశారని, అదే పరంపరలో వారు పదే పదే తెలంగాణ ఏర్పాటును అపహాస్యం చేస్తూ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఉత్తగ రాలేదని, కెసిఆర్ రాజకీయ చతురత, ఆమరణ నిరాహార దీక్ష, విద్యార్థుల వీరోచిత పోరాటం, సాక్షిగా తెలంగాణ ఏర్పాటు బిల్లు పాస్ అయిందనే సత్యాన్ని మరిచి బీజేపీ ఎంపీలు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. నిండు పార్లమెంటులో తేజస్వి సూర్య అవమానకర వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ పార్లమెంట్ సభ్యులు ఖండించక పోవడం దురదృష్టకరమని అన్నారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీజేపీ వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఎంపీ తేజస్వి సూర్య తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని పక్షంలో ఇక్కడి ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని, బీజేపీ తెలంగాణ వ్యతిరేకిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతోందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, నేతలు కొమురయ్య, మధుసూదన్ రెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

## ఏడుపాయల హుండీ ఆదాయం రూ.52.12 లక్షలు

**ప్రజాపక్షం/పాపన్నపేట:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానం హుండీ ఆదాయం 52 లక్షల 12 వేల171 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మఠం వీరేశం, దేవాదాయ శాఖ మెదక్ జిల్లా ఇన్స్పెక్టర్ రంగారావు తెలిపారు. గురువారం నాడు ఆలయ పరిధిలోని గోకుల్ షెడ్ లో అధికారుల పర్యవేక్షణలో మెదక్ ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులచే హుండీ లెక్కింపు జరిగింది. నగదు మినహా మిశ్రమ బంగారం 000.024.000 గ్రాముల, మిశ్రమ వెండి 000.927.000 గ్రాములు వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిశోధన విద్యార్థులు ఏఐ ఆవిష్కరణలపై దృష్టి

ప్రజాపక్షం / గజ్వేల్ : సిద్దిపేట జిల్లా గౌరవరం శివారులోని కావేరి యూనివర్సిటీ వార్షిక టెక్ ఫెస్ట్ 'క్షితిజ్'ను గురువారం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు శ్రీకారం చుట్టి మాట్లాడారు. ఆహార భద్రత, స్థిరత్వం, ఆధునిక సాంకేతికతల మధ్య ఉన్న అనుసంధానం తదితర అంశాలపై చైతన్యం చేశారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న జనాభా నేపథ్యంలో ఆహార ఉత్పత్తి, ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావిస్తూ, ప్రిసిషన్ అగ్రికల్చర్, వ్యర్థాల తగ్గింపు, సర్క్యులర్ ఎకానమీ వంటి పద్ధతులు అవసరమని సూచించారు. పంటల దిగుబడుల అంచనాలు, నేల ఆరోగ్య పరిశీలన, సరఫరా గొలుసు నిర్వహణలో ఏఐ వినియోగ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు వివిధ సాధనాలను సృజనాత్మకంగా ఉపయోగించుకోవాలని, అయితే విమర్శనాత్మక ఆలోచనను కోల్పోకుండా ఉండాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే క్షితిజ్ లో ఏఐ టూల్స్ క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్, కేస్ స్టడీ, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, సైబర్ అవేర్‌నెస్, డిజైన్ థింకింగ్, పజిల్ ఛాలెంజ్, టెక్ డిబేట్, ట్రెజర్ హంట్, ఈస్పోర్ట్స్, ఇన్నోవేషన్ పిచ్, వెబ్ డిజైన్ వంటి కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యా రంగం, పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని పెంపొందించడం, భవిష్యత్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, డైరెక్టర్ హర్ష పోల్సాని, డీన్స్ డాక్టర్ ప్రతాప్ కుమార్ రెడ్డి, డాక్టర్ కొండ శ్రీనివాస్, డాక్టర్ సునీతా మెహతా తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు

### అదనపు కలెక్టర్ నగేష్




ప్రజాపక్షం/రామాయంపేట: ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా అందాలన్నదే ప్రజాపాలనప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం పట్టణంలోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో భాగంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ విభాగాల ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు, కొన్ని నెలలుగా సాధించిన ప్రగతిపై నివేదికలను అందించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పన, ప్రజారోగ్యం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే నూతన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై అదనపు కలెక్టర్ అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల ప్రగతి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో షాజిలోద్దీన్, తహసీల్దార్ రజనికుమారితో పాటు మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి

ప్రజాపక్షం/కొమురవెల్లి: ప్రభుత్వ కార్యక్రమాలల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో మండల స్థాయి సభలను నిర్వహించారు.అందులో భాగంగా జిల్లాలోని కొమురవెల్లి మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేయడం జరిగిందని అన్నారు.అందులో భాగంగా ఈ నెల 2న జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల్లో గ్రామ సభలు నిర్వహించామని,అనంతరం మండల స్థాయి సభలను నిర్వహిస్తున్నామని అన్నారు.మే నెలలో నియోజక వర్గ స్థాయి, జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు.99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ఒక డిపార్ట్‌మెంట్ టీమ్‌ను తీసుకొని జూన్ 11 వరకు నిర్వహిస్తున్నామని, అందులో మొదటగా పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు.తర్వాత హెల్త్ వీక్,అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజలు రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తుందని ఈ పథకం ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా ప్రతి కుటుంబానికి లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపిడివో, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రాత్మక పథకాలకు ఊపిరి పోసిన ప్రభుత్వం

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ హమీద్

ప్రజాపక్షం / గజ్వేల్ : చరిత్రాత్మక పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అయితే వాటిని పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ హమీద్ స్పష్టం చేశారు. గురువారం వర్గల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రగతి ప్రణాళిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కాగా, మండల స్పెషల్ ఆఫీసర్ పవన్ కుమార్, పరిషత్ అభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, తహసీల్దార్ రఘువీర్ రెడ్డి, ఎస్సై కరుణాకర్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని, దానికి తగినట్లుగా ప్రభుత్వం సబ్సిడీ అందజేయడంతో పాటు రూ.350 కోట్లతో నిర్మించిన ఫ్యాక్టరీని సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అలాగే రిఫైనరీకి సైతం చర్యలు తీసుకుంటుండగా, మూడేళ్లలో దిగుమతి వచ్చే ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలు సాగుచేసి ప్రయోజనం పొందవచ్చని అన్నారు. ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు ప్రాధాన్యత ఇస్తుండగా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు కూడా పరిష్కారం కానున్నట్లు చెప్పారు. అంతేకాకుండా త్వరలోనే ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమాతో ఆర్థికంగా ఆదుకోనుండగా, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రోజురోజుకు పెరిగిపోతున్న డ్రగ్స్, మత్తు పదార్థాల సరఫరాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తద్వారా యువత, విద్యార్థులను కాపాడుకోవచ్చని చెప్పారు. జంట నగరాలకు వంటిమామిడి మార్కెట్ సమీపంలో ఉన్నందున రైతులు ఆరుతడి, కూరగాయల పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. కాగా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరీ చేస్తుండగా, త్వరలోనే మరికొన్ని నూతన పథకాలు ప్రారంభించనున్నట్లు వివరించారు.




## సదాశివపేట ప్రజల తాగునీటి సమస్యలపై సమీక్ష

### టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



ప్రజాపక్షం/సదాశివపేట : టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మున్సిపల్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, మిషన్ భగీరథ ,పబ్లిక్ హెల్త్ అధికారులతో వివరంగా సమీక్షించారు. సదాశివపేట పట్టణంలోని ప్రతి ఇంటికి రోజు గంటన్నర పాటు మంచినీళ్లు సరఫరా చేసేలా ప్రణాళిక ,సింగూరు డ్యామ్ నుండి నేరుగా ఇంటింటికి మంజీర నీళ్లు అందేలా ఇంటికి వెల్ ఫిల్టర్ బెడ్, ట్యాంకులు, కొత్త పైపులైన్ల నిర్మాణం, సదాశివపేటకు ప్రతి రోజు గంటన్నర నీళ్లు ఇవ్వాలంటే రూ. 135 కోట్లు ఖర్చవుతుందని ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 60 వేల జనాభాకు ప్రతిరోజు 21 లక్షల గ్యాలెన్ల మంచినీళ్లు అవసరం కాగా కొత్తగా నిర్మించి వాటర్ స్కీమ్ లో 52 లక్షల గ్యాలెన్ల నీళ్లు అందుబాటులో ఉంటాయని ఇంజనీర్లు విశదీకరించారు. ఈ నెల 17న వాటర్ ప్రాజెక్టు గురించి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చించాలని నిర్మలజగ్గారెడ్డి సూచించారు. 18 వ తేదీన ఎంపి ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిసి వారి అభిప్రాయాలు సైతం తీసుకోవాలని సూచించారు. చివరగా 19 న సదాశివపేట ప్రజల అభిప్రాయాలను సేకరించి ఏవేని మార్పులు చేర్పులు ఉంటే పరిశీలించాలని తెలిపారు. అదే రోజు రాత్రి ఫైనల్ రిపోర్టు నాకు నిర్మలకు అందిస్తే మరుసటి రోజు సిఎం రేవంత్‌రెడ్డికి ఇస్తానని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టు విలువ రూ. 135 కోట్లు అయినా వేసినప్పటికి ప్రజాభిప్రాయం ఆధారంగా ఆ విలువ పెరిగినా ఇబ్బంది లేదని నిర్మల జగ్గారెడ్డి సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు అత్యవసరమైనందున ముందుగా తాగునీటి సమస్య పరిష్కరించి ఆ తర్వాత పేదలకు ప్లాటు వార్డుకు కు రూ. 8 కోట్ల చొప్పున అభివృద్ధి నిధుల గురించి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుందామన్నారు. వాటర్ స్కీమ్ కు ఆమోదం రాగానే టెండర్లు పిలిచి రెండేళ్లలో పనులన్నీ పూర్తి చేస్తామన్నారు.

## తాగు నీటి సమస్య రాకుండా మరమ్మతులు

ప్రజాపక్షం/సంగారెడ్డి : కొండాపూర్ మండలం గంగారం గ్రామ సర్పంచ్ తమ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు లక్ష్యంగా కృషి చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలకు మౌళిక సదుపాయాలు అందించాలనే సంకల్పంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి వేగంగా అమలు చేస్తున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు వాటర్ పైప్ లైన్ పనులను ప్రాధాన్యతగా తీసుకుని గ్రామ అభివృద్ధికి సం బంధించి నిధులను సద్వినియోగం చేస్తూ పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమం అమలులో గ్రామ ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరూ కలిసి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ సరిత అశోక్ విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపడం తమ ధ్యేయమని పేర్కొన్నారు.

## డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు



ప్రజాపక్షం/సిద్దిపేట: వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశ్యంతో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డిజీపీ స్వాతి లక్రా అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి రెడ్డి ఫంక్షన్ హాల్లో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో ఆటో, స్కూల్ వాహనాలు, లారీ, ఇతర వాహనాల డ్రైవర్లకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డ్రైవర్లకు సీపీఆర్ పైఅవగాహన కల్పించారు. అనంతరం పలువురికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డిజీపీ స్వాతి లక్రా, సిద్దిపేట సీపీలు మాట్లాడుతూ... ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు.

## స్విమ్మింగ్ పూల్‌లో మునిగి యువకుడు మృతి



ప్రజాపక్షం / గజ్వేల్ : స్విమ్మింగ్ పూల్‌లో నీట మునిగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకోగా, న్యాయం కోసం బాధితులు రోడ్డెక్కిన సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకుంది. గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులో స్విమ్మింగ్ పూల్‌ను నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన వంశీ (26) అనే యువకుడు స్విమ్మింగ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. అక్కడ రక్షించేందుకు ఎవరూ లేకపోవడంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సంఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్విమ్మింగ్ పూల్ వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే తమ కుమారుడు మృతి చెందాడని వంశీ కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ న్యాయం కోసం అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దాదాపు గంటపాటు సాగిన ఆందోళనతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోగా, గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అక్కడికి చేరుకుని బాధితులను సముదాయించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జాబ్ మేళాకు అపూర్వ స్పందన



ప్రజాపక్షం/సంగారెడ్డి : తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువతి నుంచి అపూర్వ స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. కళాశాల టీఎస్‌కేసి టాస్క్ ప్లేస్మెంట్ ఆధ్వర్యంలో కోవలెంట్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వహించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి 80 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరుకాగా అందులో 35 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధికాశాలను కల్పించాలనే లక్ష్యంతో వివిధ సంస్థల సహకారంతో ఇటువంటి జాబ్ మేళాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ లో ప్రముఖ విద్యాసంస్థలలో తారా ప్రభుత్వ కళాశాల ఒకటిగా నిలుస్తూ విద్యార్థుల భవిష్యతు అభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల విద్యార్థులతో పాటు ఇతర నిరుద్యోగులకు కూడా అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యతులో మరిన్ని ప్రముఖ సంస్థల సహకారంతో ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు జాబ్ మేళాలను కొనసాగిస్తామని ఆమె చెప్పారు. తెలంగాణలో ప్రముఖ విద్యాసంస్థలలో తారా ప్రభుత్వ కళాశాల ఒకటిగా నిలుస్తూ విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ వినోద్, టీఎస్‌కెసి కన్వీనర్ , డాక్టర్ సుచిత్ర సింగ్, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్, డాక్టర్ వాణి, టాస్క్ అధికారులు ,శ్రీనివాస్, మానస్, కోవలెంట్ లాబొరేటరీస్, ప్రతినిధులు మహిపాల్‌రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్.. అలైవ్ కార్యక్రమాలు

## అడిషనల్ డిజిపి మహేష్ భగవత్ హాజరు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాలుగో రోజు (ఏప్రిల్ 16 వాక్సిన్ యూనివర్సిటీ సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన అరైవ్ .. అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డిజిపి మహేష్ భగవత్ హాజరైనట్లు జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ ఫంకజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే ఉద్దేశ్యంతో వారం రోజుల పాటు అరైవ్ .. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి అని అన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి వివరిస్తూ డ్రైవర్ ముందుగా తన వాహనం పరిస్థితి గురించి తెలుసుకుని ఉండాలని ,ప్రయాణించే రహదారి పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వాహనాన్ని ఎంత వేగంగా నడుపుతున్నామన్నది కాదు ,ఆ వేగాన్ని నియంత్రించగలగడం ముఖ్యమని అన్నారు. అజాగ్రత్తగా వాహనం నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందని డ్రైవింగ్ సమయంలో పూర్తి ఏకాగ్రతతో ఉండాలని మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నివారించాలని సూచించారు. విశ్రాంతి లేకుండా నిరంతరం డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. డ్రైవింగ్‌లో ఎంత నైపుణ్యం ఉన్నా ఎదుటివారి తప్పిదాల వలన కూడా ప్రమదాలు సంభవించే అవకాశం ఉందని డిపిన్సివ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా అడిషనల్ డిజిపి మహేష్ భగవత్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ఎవరూ అతీతులు కాదని ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించి పరిమిత వేగంతో ప్రయాణించాలని అన్నారు. అతి వేగం క్షణిక ఆనందాన్ని కలిగించినప్పటికి ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. గమ్యాన్ని చేరుకోవడం ఎంతో ముఖ్యమో సురక్షింతంగా చేరుకోవడం అంతకంటే ముఖ్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదల్లో గాయపడిన వారికి వెంటనే సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాహ్ వీర్ పథకం ఒక ముఖ్యమైన రోడ్డు భద్రత కార్యక్రమమని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ( గోల్డెన్ ఆపర్ మొదటి 60 నిమిషాలు) బాధితుడికి సహాయం చేసి ఆసుపత్రికి చేర్చిన వ్యక్తిని రాహ్‌వీర్ అని పిలుస్తారని చెప్పారు. అటువంటి వ్యక్తులకు ప్రభుత్వం తరపున రూ. 5 వేలు వరకు నగదు బహుమతి అందజేస్తారని తెలిపారు. అనంతరం నేను ట్రాపిక్ నియమాలను పాటిస్తాను అని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ప్రమాదం జరిగినప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం చేరే విధంగా ఇది పని చేస్తుందని ప్రమాదం జరిగిన సమయంలో వాహనం వేగం ఉందో కూడా నమోదు అవుతుందని చెప్పారు. బస్సులో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు పొగ గుర్తించిన వెంటనే సెన్సార్ ఆక్టివేట్ అయ్యి పొగను బయటకు పంపించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా అగ్ని ప్రమాదం సమయంలో ప్రయాణికులు సులభంగా బయటపడేందుకు ఆటోమేటిక్ గ్లాస్ బ్రేకింగ్ సిస్టమ్ కూడా అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వాక్సిన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరి రామకృష్ణ వర్మ, డైరెక్టర్ సెక్యూరిటీ శశికాంత్ ఉపాద్యాయ్, (రిటైర్డ్ ఐజి ) డీన్ స్కూల్ ఆఫ్ లా డా. ఏ శ్రీలత ,డీన్ స్కూల్ ఆఫ్ సైన్స్ డా. దయాకర్ అసోసియేట్ డీన్ డా. బ్యూటీ పాండే రిజిస్ట్రార్ అభిజిత్ శిరోద్కర్ డీన్ అర్కిటెక్చర్ , సోనియా గుప్తా హెడ్ ఆఫ్ సెక్యూరిటీ డా. ఏవిఎస్ శ్రీదర్, సంగారెడ్డి, డిఎస్పీ సత్తయ్యగౌడ్, ఇన్స్పెక్టర్ సుమన్ కుమార్ ట్రాపిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, డీసీఆర్‌బి ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్‌ఐ రాజీవ్, నాయక్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

# బీరన్న దేవాలయానికి విగ్రహాల బహుకరణ

**ప్రజాపక్షం/శాయంపేట :** గవర్నమెంట్ లెక్చరర్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్ వారి తండ్రి దివంగత సవ్వాసి పెద్ద రాజమల్లు (పెదరాయుడు) జ్ఞాపకార్థం తమ సొంత గ్రామమైన పెద్ద కోడెపాకలోని కురుమ కుల దైవమైన బీరన్న దేవస్థానానికి బీరన్న కామరతి, అక్క మహంకాళి, భోగన్న మరియు పోతన్నల లింగాలు(అన్ని రాతివి)డొనేట్ చేసి రూ. 81000 ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులందరికీ కురుమ కులం తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు కురుమ కుల పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద కురుమ అమ్మ తిరుపతి, కురుమ సంఘ అధ్యక్షుడు అమ్మ రవి, ఉపాధ్యక్షులు సవ్వాసి రమేష్, బీరన్న ఆలయ కమిటీ అధ్యక్షులు సవ్వాసి బీరయ్య, డాక్టర్ అమ్మ వేణు, అమ్మ రాజు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన అధికారులు

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని గురువారు సెంట్రల్ సెక్రటరీ సర్విస్ ఏఎస్ వోలు 70 మంది సందర్శించారు. హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకోనగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రా మప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట టూరిజం సిబ్బంది, టూరిస్ట్ పోలీసులు వేణు, శ్రీనివాస్, అరుణ్ , కోర్స్ డైరెక్టర్ కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, , పోలీస్, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వేసవిలో తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## డిఆర్‌డిఎ పిడి శ్రీనివాస్ రావు




**ప్రజాపక్షం/నర్సాపూర్:** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా ఆయా గ్రామాల సర్పంచులు కార్యదర్శులు చూడాలని, ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని డిఆర్‌డిఎ పిడి శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం నర్సాపూర్ లోని రైతు వేదికలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై మండల స్థాయిలో సర్పంచులకు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండల తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహమ్మద్ మోజమ్ హుస్సేన్, సీఐ జాన్ రెడ్డి, ఎంఈఓ తారా సింగ్, ఏవో దీపిక, ఐకెపి ఎపిఎం సంగమేశ్వర్, విద్యుత్ ఏఈ రామ్మూర్తి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, గ్రామాల్లో దోమల నివారణకు గాను మురుగు కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనందున ఇల్లు నిర్మించుకునేలా అధికారులు చూడాలన్నారు. ప్రైమరీ స్కూల్ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అల్పాహార పథకం జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా గ్రామాల సర్పంచులకు, కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ముందుగా ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తమ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, స్రవంతి కరుణాకర్, తుల్చమ్మ, బిక్షపతి, యాదగిరి గౌడ్, శివకుమార్, సుమతి శివకుమార్, కొండల్ రెడ్డి, విజయ శివకుమార్, దేవి సింగ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

# మల్లన్న సాగర్ ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** మల్లన్న సాగర్ ముంపుతో సర్వం కోల్పోయామని, ఇప్పుడు న్యాయం కూడా కోల్పోవాలా? అంటూ ఒంటరి మహిళలు, పురుషులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే పరిస్థితుల్లో ఉన్న బాధితులకు వేర్వేరు విధంగా ప్యాకేజీలు ఇవ్వడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపుకు గురై వందలాది కుటుంబాలు భూములు, ఇళ్లు, జీవనాధారం కోల్పోయారు. ఒకప్పుడు స్వయం సమృద్ధిగా జీవించిన ప్రజలు ప్రస్తుతం పునరావాస కాలనీల్లో కష్టాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు, ఒంటరి పురుషులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తుండగా, ఈ నేపథ్యంలో ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ మాత్రమే వారికి ప్రధాన ఆధారంగా మారింది. న్యాయం కోసం కొంత మంది బాధితులు కోర్టును ఆశ్రయించగా, వారికి ఏప్రిల్ 14న రూ.12,54,000 చొప్పున ఆర్థిక సహాయం అందింది. అయితే కోర్టుకు వెళ్లని ఇతర ఒంటరి బాధితులు ఇప్పటికీ అదే సహాయం కోసం ఎదురు చూస్తుండటం ఆందోళనకు గురి చేస్తోంది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో కోర్టుకు వెళ్లలేదని, కానీ ఇప్పుడు అదే కారణంగా మాకు నష్టం జరుగుతోందని అన్నారు. ముంపుతో మా జీవితాలు పూర్తిగా అస్తవ్యస్తమయ్యాయనీ, కనీస న్యాయం కూడా అందకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కౌన్సిలర్లు మన్యం విష్ణువర్ధన్ రెడ్డి, గుగ్లోత్ రమేశ్, శేరుపల్లి ఉపేందర్ రెడ్డి, కోట బాబు, కొలిచిలిమ భవాని, నర్సింహారెడ్డి సమక్షంలో బాధితులు తమ సమస్యలను వివరించి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, ఆర్డిఓ సదానందంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్లన్న సాగర్ ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, సమాన న్యాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుకు వెళ్లిన వారికి ఇచ్చినట్లే, కోర్టుకు వెళ్లని బాధితులకూ అదే స్థాయిలో ఆర్థిక సహాయం వెంటనే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. అభివృద్ధి అంటే ప్రాజెక్టులు నిర్మించడం మాత్రమే కాకుండా, ముంపుతో అన్నీ కోల్పోయిన ప్రజలకు జీవనోపాధి, భద్రత, మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రతి బాధితునికి సమాన న్యాయం చేయడం తోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లిన వారికి ఇచ్చినట్లే, కోర్టుకు వెళ్లని వారికి కూడా ప్యాకేజీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని వివరించారు.

# పెరుగుతున్న ఊపిరితిత్తులు, వంశపారంపర్య కేన్సర్ల ముప్పు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ముందస్తు స్క్రీనింగ్ అత్యాధునిక చికిత్సలు అవసరం ఒకప్పుడు ఊపిరితిత్తుల క్యాన్సర్ అంటే కేవలం ధూమపానానికి మాత్రమే సంబంధించిందని భావించే వారు. కానీ, ప్రస్తుతం ధూ మపానం చేయని వారిలో, యువతలో కూడా ఈ వ్యాధి ఎక్కువగా నిర్ధారణ అవుతుండటం వైద్య నిపుణులలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీనితో పాటు,జన్యుపరమై న కారణాల వల్ల వచ్చే వంశపారంపర్య క్యాన్సర్లు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఇవితరచుగా వ్యాధి తీవ్రమయ్యే దశ వరకు గుర్తించబడవు. మారుతున్న జీవనశైలి, పర్యావరణ కారకాలు, జన్యు ఉత్పరివర్తనలు జనటిక్ మ్యుటేషన్స్ ఈ వ్యాధుల పెరుగుదలకు కారణమవుతున్నాయని సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణులు చెప్పారు. దీనివల్ల అవగాహన, ముందస్తు గుర్తింపు, సరైన సమయంలో చికిత్స అందడం గతంలో కంటే ఇప్పుడు మరింత కీలకంగా మారింది.ఆంకాలజీ విభాగంలో వస్తున్న అధునాతన పద్ధతులు క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో, ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చింది. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ నగ్స్, పాలిమరేజ్ చైన్ రియాక్షన్ పీసీఆర్ వంటి అత్యాధునిక రోగనిర్ధారణ సాధనాలు ఇప్పుడు క్యాన్సర్ వ్యాప్తికి కారణమయ్యే జన్యు ఉత్పరివర్తనలను ఖచ్చితంగా గుర్తించడానికి వీలు కల్పిస్తున్నాయి.ఈ సాంకేతికతలు ముందస్తు గుర్తింపులో సహాయపడటమే కాకుండా, వ్యక్తిగతీకరించిన చికిత్స ప్రణాళికలను రూపొందించడంలో మార్గనిర్దేశం చేస్తాయి. లిక్విడ్ బయాప్స అని పిలువబడే ఒక సాధారణ రక్త పరీక్ష, మినిమల్లీ ఇన్వాసివ్ మరియు సమర్థవంతమైన స్క్రీనింగ్ సాధనంగా ఉద్భవిస్తోంది. ఇది జన్యుపరమైన ముప్పు ఉన్న కుటుంబ సభ్యులకు ముందస్తు స్క్రీనింగ్, నివారణ సంరక్షణను అందించడానికి సహాయపడుతుంది.తీవ్రమైన దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స పద్ధతులు ఇప్పుడు సాధారణ కీమోథెరపీకి మించిఅభివృద్ధి చెందాయి. నేడు, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీలు పేషేంట్ల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. టార్గెటెడ్ థెరపీ నిర్దిష్ట జన్యు ఉత్పరివర్తనాలపై దృష్టి సారిస్తుంది, కాగా ఇమ్యునోథెరపీ క్యాన్సర్ కణాలతో మరింత సమర్థవంతంగా పోరాడటానికి శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. సాంప్రదాయ చికిత్సలు పరిమితంగా ఉన్న తీవ్రమైన దశలలోఈ చికిత్సలు విశేషంగా ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా వంశపారంపర్య క్యాన్సర్లలో జన్యుపరమైన కారకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్జీఎస్ మరియు పీసీఆర్ వంటి అధునాతన నిర్ధారణ పద్ధతులు, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ వంటి చికిత్సలు అందుబాటులోకి రావడంతో, మేము ఇప్పుడు మరింత వ్యక్తిగతీకరించిన, సమర్థవంతమైన చికిత్సలను అందించగలుగుతున్నాము. ముఖ్యంగా, సాధారణ రక్త పరీక్షల ద్వారా ముందస్తు స్క్రీనింగ్ చేయడం వలన లక్షణాలు కనిపించకముందే ముప్పు పొంచి ఉన్న వ్యక్తులను గుర్తించవచ్చు, ఇది చికిత్స ఫలితాలను గణనీయంగా మెరుగుపరుస్తుంది. కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్న వ్యక్తులు సకాలంలో స్క్రీనింగ్, జన్యుపరమైన కౌన్సెలింగ్ చేయించుకోవాలని ప్రోత్సహిస్తోంది, ఇది ముందస్తు గుర్తింపు, నివారణలో కీలక పాత్ర పోషిస్తుంది.మరింత సమాచారం కోసం పి.సంజీవ్ కుమార్ యశోద గ్రూప్ గురించి యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిధ్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోంది.

# ఆదర్శ పంచాయతీగా శివాయిపల్లిని తీర్చిదిద్దాలి

**ప్రజాపక్షం/రామాయంపేట:** ఆదర్శ గ్రామ పంచాయతీగా శివాయిపల్లి గ్రామాన్ని తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని తూప్రాన్ డిఎస్‌పి నరేందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని శివాయిపల్లి గ్రామంలో వంద శాతం హెల్మెట్ ధరించాలని, గ్రామంలో మద్యం అమ్మకాలను నిషేదించాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని పంచాయతిలో తీర్మాణం చేపట్టారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శివాయిపల్లి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్‌అలైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అధితులుగా హాజరైన డిఎస్‌పి సభను ఉద్దేశించి మాట్లాడారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, హెల్మెట్, సీటు బెల్ట్ దరించకుండా వాహనాలు నడపడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మెదక్ జిల్లాలో రెండవ ఆదర్శగ్రామంగా శివాయిపల్లి నిలిచిందన్నారు.ఈకార్యక్రమంలో ఎస్‌ఐ బాల్‌రాజు, మాజీ సర్పంచు రామక్రిష్ణ, ఉపసర్పంచు మమతతో పాటు పంచాయతి కార్యదర్శి, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.